సాక్షి తిరుపతి

గురువారం । 16 । అక్టోబర్ । 2025



ఫీజు చెల్లింపులు.. తప్పని పడిగాపులు

ఎస్వీయూలో డిజిటల్ పేమెంట్ సిస్టమ్ లేకపోవడంతో ఫీజులు చెల్లించేందుకు విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. - 10లో



'వసతి' కోసం వెతలు!

టీటీడీ విద్యాసంస్థల్లో సీటు దొరికినా హాస్టల్‌లో చోటు లభించక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. - 10లో



బ్యాంక్‌లో చోరీకి యత్నం

నాగలాపురంలోని యూనియన్ బ్యాంకులో మంగళవారం రాత్రి ఇద్దరు దుండగులు చోరీకి యత్నించారు. - 10లో

న్యూస్‌రీల్

విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు తాత్కాలిక బ్రేక్

తిరుపతి రూరల్ : ఏపీలో విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. యాజమాన్యాలతో మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన చర్చలు విఫలం కావడంతో బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లాల్సి ఉంది. ఆ మేరకు ఇప్పటికే సమ్మె నోటీసును కూడా ప్రభుత్వానికి అందించారు. కొన్ని అంశాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనుమతులు కావాల్సి ఉంది. ఆయన ప్రధాని పర్యటన ఏర్పాట్లలో బిజీగా ఉన్నారని, చీఫ్ సెక్రటరీతో ఈనెల 17వ తేదీన మరోసారి చర్చించిన తర్వాత ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చని యాజమాన్యాలు సూచించాయి. దీంతో సమ్మెను రెండు రోజులపాటు వాయిదా వేసేందుకు జేఏసీ నేతలు అంగీకరించారు. అయితే చీఫ్ సెక్రటరీ సమక్షంలో జరిగే చర్చలు విఫలమైతే నిరవధిక సమ్మెలోకి వెళతామని స్పష్టం చేశారు.

ఇద్దరు హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు



కోడిగుడ్లను పరిశీలిస్తున్న డీఈఓ కేవీఎస్ కుమార్

రేణిగుంట: మండలంలోని ఆర్.మల్లవరం జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డీఈఓ కేవీఎస్ కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాలు.. బుధవారం ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎఫ్ఏ పరీక్షలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో లోపాలను గుర్తించారు. కలర్ కోడింగ్ లేకపోవడంతోపాటు తగు పరిమాణంలో లేని కోడిగుడ్లను పిల్లలకు వడ్డించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వంట గదులు, స్టోర్ రూమ్‌లు పరిశుభ్రంగా లేకపోవడంపై మండిపడ్డారు. విద్యార్థులకు నాసిరకం ఆహారం పెడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇద్దరు ప్రధానోపాధ్యాయులతోపాటు కోడిగుడ్లు సరఫరా చేసిన సన్‌రైజ్ ఆగ్రో ఫామ్స్ సంస్థకు సైతం నోటీసులు జారీ చేశారు.

వ్యవసాయంలో సాంకేతికత అవసరం



ఔషధ మొక్కలు పంపిణీ చేస్తున్న అతిథులు

రేణిగుంట : వ్యవసాయంలో నూతన సాంకేతికతను పాటిస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), చిత్తూరు వారి సహకారంతో బుధవారం కిసాన్ మేళా నిర్వహించారు. రమణ మాట్లాడుతూ వ్యవసాయంతో పాడి పరిశ్రమ కూడా రైతులు చేపడితే అధిక ఆదాయం పొందవచ్చని వెల్లడించారు. శోభామణి, సుమతి, రూత్, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథ రామిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి, వేదికపై భూమన, నారాయణస్వామి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, సమన్వయకర్తలు మధుసూదన్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, వెంకటేగౌడ, విద్యార్థి విభాగం నేత హర్షిత్‌రెడ్డి తదితరులు

పోరుకు సిద్ధం



"కూటమి అక్రమాలను అడ్డుకుంటాం.. అరాచకాల అంతుచూస్తాం.. నకిలీ మద్యంపై ఉద్యమిస్తాం.. సీబీఐ విచారణ వేయాలని డిమాండ్ చేస్తున్నాం.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమష్టిగా పోరాడుతాం.. కార్యకర్తలకు అడుగడుగునా అండగా నిలుస్తాం.. కక్ష సాధింపు చర్యలకు భయపడం.. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌ను ఎండగడతాం.. నిరంకుశ పాలనకు మంగళం పాడే వరకు విశ్రమించం.. సంక్షేమ రాజ్యం తీసుకువచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తాం" అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు.

కల్తీ మద్యంపై ఉద్యమిస్తాం

- సిట్ కాదు సీబీఐ విచారణ కావాలి
- నకిలీ మకిలీని ఆపాదిస్తే సహించం
- అక్రమ కేసులు.. అరెస్టులకు భయపడం
- వైఎస్సార్‌సీపీ జిల్లాస్థాయి సమావేశంలో పెద్దిరెడ్డి, భూమన



నకిలీ మద్యంపై నిరసన తెలుపుతున్న మహిళలు, వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి/మంగళం : ప్రజలు కొనుగోలు చేస్తున్న ప్రతి నాలుగు మద్యం బాటిళ్లలో ఒకటి నకిలీదేనని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, నియోజక వర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్సీలు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ పక్కా ఆధారాలతో నకిలీ మద్యం బాగోతం బయటపడితే అందులో నుంచి తప్పుకునేందుకు చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. సిగ్గులేకుండా సిట్ విచారణ వేశారని, అందులో తనకు కావలసిన అధికారులను నియమించుకున్నారని ఆరోపించారు. దమ్ముంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. భూమన మాట్లాడుతూ రాబోయే వైఎస్ జగన్ పాలనలో కార్యకర్తలదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే పార్టీలో ప్రక్షాళన చేపట్టారని, పాలనలో కార్యకర్తల భాగస్వామ్యం ఉంటుందని వెల్లడించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ సిట్ విచారణకు భయపడే వ్యక్తిని కాదని, నిజాయితీగా ఉన్నాను కాబట్టే ఆవేశంగా మాట్లాడతానని తెలిపారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పార్టీకి ప్రాణవాయువు కార్యకర్తలే అన్నారు. ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ దురాగతాల పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. చిత్తూరు పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం చారిత్రాత్మక అవసరమని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, లలితా థామస్, వెంకటేగౌడ్, సునీల్‌కుమార్, సమన్వయకర్తలు విజయానందరెడ్డి, భూమన అభినయ్, నూకతోటి రాజేష్, నేతలు అనీషారెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ పాల్గొన్నారు.

త్వరితగతిన కమిటీల నియామకం

కూటమి ప్రభుత్వ అరాచకాలపై ఉద్యమం ఉధృతం చేసేందుకు గ్రామస్థాయి, వార్డు, మండల, జిల్లా, పార్లమెంట్ కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు నియోజకవర్గాల సమన్వయకర్తలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ కేసులు, అరెస్టులపై పోరాటం సాగించేందుకు జగనన్న సైన్యం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

అద్భుత స్పందన

తిరుపతిలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ జిల్లా సమావేశానికి అద్భుత స్పందన లభించింది. కేవలం ఒక రోజు ముందుగా సమాచారం ఇచ్చినా తిరుపతి, చిత్తూరు జిల్లాల నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. సమావేశం అనంతరం నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. కల్తీ మద్యంపై ప్రశ్నించారని నవీన్, వెంకటేష్‌పై ప్రభుత్వ ఒత్తిడితోనే పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన చేరుకుని ఆందోళనను విరమింపజేసేందుకు యత్నించారు.

తప్పుడు ఆరోపణలు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఆవుకొవ్వు కలిసిందంటూ చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేశారు. తన అనుకూల సిట్ అధికారులతో విచారణ జరిపించి సుప్రీంకోర్టుతో మొట్టికాయలు వేయించుకున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మద్యం కుంభకోణం జరిగిందని మరో సిట్ వేశారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా చాలామంది వైఎస్సార్‌సీపీ నేతలను జైళ్లకు పంపారు. ఇప్పుడు కల్తీ మద్యం కేసులో తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మరో సిట్‌ను ఏర్పాటు చేశారు. ఇబ్రహీం పట్నంలో తయారు చేస్తున్న కల్తీ మద్యం డంప్‌ను పట్టించిన వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్‌ను ఇందులో ఇరికించేందుకు యత్నిస్తున్నారు. చంద్రబాబుకు చిరకాల ప్రత్యర్థిని కాబట్టే నన్ను, నా కుటుంబాన్ని వేధించేందుకు తెగబడుతున్నారు.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్

చంద్రబాబుకు ఎందుకు భయం

సీబీఐ విచారణ అంటే చంద్రబాబుకు ఎందుకంత భయం. సిట్ అధికారులైతే.. తాను అనుకున్న వారందరినీ దోషులుగా చిత్రీకరించేందుకు వీలుంటుందనే కుట్రలకు పాల్పడుతున్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చిన్నచిన్న విషయాలకు కూడా సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసేవారు. ఇప్పుడు మేము కోరినట్లు సీబీఐ విచారణ జరిపించాల్సిన బాధ్యత చంద్రబాబుకు లేదా? కల్తీ మద్యం మకిలిని వైఎస్సార్‌సీపీ నేతలకు అంటించేందుకు కుట్ర చేస్తున్నారు. మద్యం బాటిళ్లను స్కాన్ చేయడానికి యాప్‌ను కూడా రూపొందించామని కాకమ్మ కబుర్లు చెబుతున్నారు. రూ. వేల కోట్లు దోచుకున్న తర్వాత స్కాన్ యాప్‌లను రూపొందించి ప్రయోజనం ఏంటి. రాష్ట్రంలోని 4వేలకు పైగా మద్యం షాపులు కూటమి నేతల చేతిలో ఉన్నాయి.

– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు



నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ..



కూటమి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని హెచ్చరిస్తూ..



అరాచక పాలనపై సమష్టిగా పోరాడుతామని స్పష్టం చేస్తూ..

కలానికి సంకెళ్లు!

ప్రశ్నిస్తే కేసులు.. వేధింపులు

- జిల్లాలోని పాత్రికేయులపై అక్రమ కేసులు
- ప్రభుత్వ తీరుపై జర్నలిస్టు సంఘాల ఆగ్రహం



చిత్తూరు అర్బన్ : ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే మీడియా సమాజంలో జరుగుతున్న పొరపాట్లను పాత్రికేయులు ఎత్తి చూపితే అధికారులు, పాలకులు పొరపాట్లను సరిచేసుకోవాలి. బాధితులకు న్యాయం చేయాలి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రశ్నించే పత్రికలపై కేసులు పెడుతున్నారు. రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ హక్కుకు సంకెళ్లు వేస్తున్నారు. మద్యంపై వార్తలు రాస్తున్నందుకు 'సాక్షి' పత్రికపై కక్షగట్టి కేసులు పెడుతున్నారు.

జిల్లాలో కేసులు ఇలా..

పత్రికలో ఏదైనా కథనం ప్రచురితమైతే అందులో ఉన్న విషయాన్ని గుర్తించి, లోటుపాట్లను సరిదిద్దుకోవాలి. తప్పుచేసిన వాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోచ్చు. కథనంలో ఏదైనా తప్పుగా ఉందనిపిస్తే దాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో ఖండించవచ్చు. న్యాయపరంగా ముందుకు వెళ్లొచ్చు. ఇవన్నీ వదిలేసి వార్తలు రాసిన పాత్రికేయులే లక్ష్యంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో జర్నలిస్టులపై కేసులు నమోదవడం ఆందోళనకు గురిచేస్తోంది.

- కుప్పం రూరల్ మండలంలో ఒకరు చనిపోతే శ్మశాన వాటికలో ఓ వర్గం అనుమతించలేదని, స్థానికంగా పోలీసులు కల్పించుకోవడంలో పరిస్థితి సద్దుమణిగిందంటూ సాక్షితో పాటు ఇతర పత్రికల్లోనూ వార్తలు ప్రచురితమయ్యాయి. కానీ స్థానిక సాక్షి విలేకరి నాగరాజుపై స్థానిక కూటమి నేతలు ఫిర్యాదు చేయడంతో ఈ ఏడాది జూన్‌లో కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.
- కుప్పంలో హంద్రీ–నీవా కాలువ గేట్లలోకి పాము వచ్చిందని, గేటు మరమ్మతు చేసే సమయంలో నీళ్లు ఆగాయంటూ 'సాక్షి'లో వార్త ప్రచురితమయ్యింది. దీన్ని కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో గతనెల 'సాక్షి' రిపోర్టర్లపై కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.
- పుంగనూరులో ఓ మైనర్ బాలిక కనిపించలేదని పోలీసులు మీడియాకు చెప్పడంతో గతేడాది వార్త ప్రచురించారు. అయితే బాలిక హత్యాచారానికి గురయినట్లు పోలీసుల దర్యాప్తులో తేలి, నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలు రాసినందుకు సాక్షి ఎడిటర్‌తో పాటు స్థానిక విలేకరి ప్రకాష్‌పై కేసు పెట్టారు.
- తిరుమలలో కల్తీనెయ్యి వ్యవహారంపై పాలకులు ఆరోపణలు చేయడం, దీనిపై సుప్రీం కోర్టు కల్పించుకుని విచారణకు ఆదేశించడం తెలిసిందే. తిరుమలలో జరిగి వాస్తవాలు బయటపెట్టినందుకు సాక్షి యాజమాన్యంపై కేసు నమోదు చేశారు.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన టీడీపీ నేతల మధ్య ఫ్లెక్సీ వివాదం తలెత్తింది. ఒకరి ఫ్లెక్సీ మరొకరు తొలగిస్తుండగా తొట్టంబేడు 'సాక్షి' రిపోర్టర్ హరీష్‌రెడ్డి వీడియో తీశారు. దీనిపై వార్త రాసినందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో అతని పై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలోనూ దారుణ పరిస్థితి..

ములకలచెరువులో కల్తీ మద్యం తయారుచేయడం పై 'సాక్షి' పత్రికలో వరుస కథనాలు వస్తున్నాయి. దీన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం సాక్షి ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వాలని బుధవారం ఏకంగా హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయానికి వెళ్లి ప్రశ్నల పేరిట ఇబ్బందికర పరిస్థితి సృష్టించారు. నెల్లూరు సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ మస్తాన్‌రెడ్డికు సైతం నోటీసులు ఇచ్చి, విచారణ పేరిట స్టేషన్‌కు పిలిపించారు.



పాత్రికేయులపై తప్పుడు కేసులకు నిరసనగా చిత్తూరులో ఆందోళన చేస్తున్న జర్నలిస్టు సంఘాలు (ఫైల్)

ఆక్షేపణీయం



జర్నలిస్టులను ఏ ప్రభుత్వమైనా జర్నలిస్టులుగానే చూడాలి. యాజమాన్యాలతో ముడిపెట్టొద్దు. వాస్తవాలను రాసిందుకు కేసులు పెడుతూ పోవడం మంచి పద్ధతికాదు. ఇది ప్రతికా స్వేచ్ఛను హరించడమే. అది ఆక్షేపణీయం.

– మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

భావ వ్యక్తీకరణపై దాడి..



రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా మాట్లాడే హక్కుతో పాటు భావ వ్యక్తీకరణ వ్యక్త పరిచే హక్కును కల్పించింది. ప్రభుత్వాల్లో జరిగే తప్పులకు పత్రికలు ఎత్తి చూపిస్తాయి. ఇందులో తప్పేం ఉంది. ఆ మాత్రం దానికి పత్రికా కార్యాలయాల్లో సోదాలు చేయడం, పాత్రికేయులపై కేసులు పెట్టడం సరైంది కాదు.

– కెఎం.అశోక్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

పోరాటమే శరణ్యం



పత్రికలు, పాత్రికేయులపై కేసులు పెట్టి నోళ్లు మూయిస్తామనుకునే ఏ ప్రభుత్వమూ మనుగడ కొనసాగించలేదు. కేసులు పెట్టినంత మాత్రన ప్రశ్నించే గొంతుకను అణగదొక్కలేరు. జిల్లాలో పలువురు పాత్రికేయులపై కేసులు పెట్టారు. దీనిపై ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ఆందోళనలు చేస్తున్నాం. మున్ముందు ఇలాంటివి కొనసాగితే రోడ్డెక్కి పోరాటాలు చేయక తప్పదు.

– కాశేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏపీయూడబ్ల్యూజే

క్లుప్తంగా

పేటశ్రీకి సాహితీ పురస్కారం



పేట శ్రీనివాసులురెడ్డి

తిరుపతి సిటీ : ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి (పేటశ్రీ) రచించిన తిరుపతి కథలు పుస్తకానికి సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం ప్రకటించింది. ఈ నెల 29వ తేదీన హైదరాబాద్ నాంపల్లిలోని నందమూరి తారకరామారావు కళామందిరంలో ఆయనకు అవార్డుతోపాటు రూ.2,116 నగదు బహుమతి అందించనున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న శ్రీరంగం మఠం పీఠాధిపతి



పీఠాధిపతి విద్య వల్లభ తీర్థ స్వామీజీకి స్వాగతం పలుకుతున్న టీటీడీ అధికారులు

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం ఉడిపిలోని కానీయూరు మఠం పీఠాధిపతి విద్య వల్లభ తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

తిరుపతి అర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పర్యావరణ పరిరక్షణపై కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కమిషనర్ మౌర్యతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణపై అవగాహన అవసరమని, రీసైక్లింగ్ చేయడం మంచిదని వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్క్యులర్ ఎకానమీ దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ నాగేశ్వర రాజు, డీపీఓ సుశీలాదేవి, జిల్లా మైన్స్ అధికారి బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

ఎర్రచందనం పట్టివేత



పట్టుబడిన దుంగలతో అధికారులు

భాకరాపేట:అటవీ అధికారులు చేపట్టిన వాహన తనిఖీల్లో బుధవారం సుమారు రూ.25లక్షల విలువైన 15 ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి. అటవీ శాఖ అధికారి ఎన్.వెంకటరమణ, ఎఫ్‌బీఓలు వై.రాజేష్ కుమార్, ఎం.సదాశివయ్య, జి.ప్రదీప్ చంద్, సి.రవి, జేబీ నిఖిల్, డ్రైవర్లు హెచ్.శంకర్, ఎన్.రోహిత్ పాల్గొన్నారు.

వసతి కోసం వెతలు!



టీటీడీ విద్యాసంస్థల్లో సీటు దక్కిన ఆనందం అంతలోనే ఆవిరవుతోంది. హాస్టల్‌లో చోటు పొందడం గగనంగా మారుతోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ఉత్తమ మార్కులు సాధించిన వారికి సైతం హాస్టల్ సీటు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో అర్హులైన వారు కూడా నిత్యం కళాశాలల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఎమ్మెల్యేలు.. మంత్రుల సిఫార్సు ఉత్తరాలతో ప్రిన్సిపాళ్ల దయాదాక్షిణ్యాల కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించింది.

- టీటీడీ విద్యాసంస్థల్లో హాస్టల్ సీటు కోసం విద్యార్థుల అవస్థలు
- కళాశాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు
- సీట్లు పెంచాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ : టీటీడీ డిగ్రీ కళాశాలలు విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారాయి. రాయలసీమలో పలు జిల్లాల నుంచి టీటీడీ విద్యా సంస్థలల్లో డిగ్రీ కోర్సులల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు హాస్టల్ వసతి కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కళాశాలల్లో సీట్లు సాధించినా హాస్టల్ వసతి కల్పించకపోవడంతో విద్యార్థుల, తల్లిదండ్రుల అవస్థలు వర్ణనాతీతం. ఏటా తిరుపతిలోని పద్మావతి డిగ్రీ కళాశాలతో పాటు ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఇదే తంతు కొనసాగుతోంది. విషయం తెలిసినా టీటీడీ అధికారులలో చలనం కనిపించడంలేదు.

250 సీట్లు పెంచాలి

టీటీడీ డిగ్రీ కళాశాలలో ప్ర గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే అధికంగా ప్రవేశాలు పొందుతుంటారు. ఈ నేపథ్యంలో టీటీడీ అధికారులు అడ్మిషన్లకు తగ్గట్టు హాస్టల్ వసతి కల్పించాల్సిన అవసరముంది. పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో రెండు విడతల అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా సీట్లు పొందిన విద్యార్థుల్లో కేవలం 40శాతం మందికి మాత్రమే అధికారులు హాస్టల్ వసతి కల్పించారు. దీంతో మరో 60శాతం మంది హాస్టల్ వసతి కోసం పడిగాపులు కాస్తున్నారు. అలాగే ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోనూ సీట్లు పొందిన విద్యార్థుల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఈ క్రమంలో ఒక్కో కళాశాల హాస్టల్‌లో మరో 250 సీట్లు పెంచాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

90శాతం మార్కులు సాధించినా..

ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి కళాశాలలో సీట్లు ఇస్తున్నారే తప్ప హాస్టల్ వసతిపై మెలిక పెడుతున్నారు. దీంతో వందలాది మంది విద్యార్థులు దిక్కుతోచక కళాశాలల చుట్టూ తిరుగుతున్నారు. ఎమ్మెల్యే, మంత్రుల సిఫార్సు లెటర్లు తీసుకుని ప్రిన్సిపాళ్ల చాంబర్లకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. టీటీడీ ఆధ్వర్యంలోని ఒక్కో కళాశాలలో సుమారు 450 నుంచి 550 వరకు హాస్టల్ సీట్లు ఉన్నాయి. వాటిని మెరిట్ ప్రాతిపదికన కేటాయిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే 90శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు సైతం హాస్టల్ సీట్లు దక్కడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీటీడీ చొరవ చూపాలి



టీటీడీ విద్యా సంస్థలలో చదువుకోవడం అదృష్టంగా విద్యార్థులు బావిస్తారు. అయితే హాస్టల్ సీట్లు దక్కకపోవడంతో చాలా మంది టీసీలు తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విషయంలో టీటీడీ చొరవ చూపాలి. ఇంటర్‌లో 950 మార్కులు సాధించిన విద్యార్థినికి పద్మావతి కళాశాలలో హాస్టల్ సీటు దక్కకపోవడం విచారకరం. తక్షణం హాస్టల్ సీట్లు పెంచాల్సిన అవసరముంది. – ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఉద్యమం తప్పదు



టీటీడీ విద్యా సంస్థలలో డిగ్రీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు పూర్తిస్థాయిలో హాస్టల్ వసతి కల్పించాలి. దూరాభారం నుంచి పేద విద్యార్థులు డిగ్రీ కోర్సులలో ప్రవేశాలు పొందుతున్నారు. కానీ ఇంటర్‌లో 95శాతం మార్కులు పొందిన విద్యార్థులకు కేవలం కాలేజ్‌లో సీటు ఇచ్చి హాస్టల్ వసతి కల్పించకపోవడం దారుణం. టీటీడీ అధికారులు పట్టించుకోకుంటే ఉద్యమం తప్పదు. – రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి

విద్యార్థుల జీవితాలతో ఆటలా..



పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో వందలాది మంది విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు హాస్టల్ సీట్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. అలాగే ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలోనూ ఇదే పరిస్థితి. కళాశాలల్లో సీటు పొందిన ప్రతి విద్యార్థికీ హాస్టల్ వసతి కల్పించాలి. కానీ టీటీడీ అధికారులు విద్యార్థుల జీవితాలతో ఆటాడుకుంటున్నారు. తీరు మారకుంటే పోరుబాట పడతాం. – ప్రేమ్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, తిరుపతి

దారుణంగా ఉంది



టీటీడీ విద్యా సంస్థలలో డిగ్రీ ప్రవేశాలు ఆలస్యంగా చేపట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు. రెండు విడతలుగా అడ్మిషన్లు చేపట్టినా హాస్టల్ సీట్లు కేటాయించడంతో ఇటు కళాశాల అధికారులు, అటు టీటీడీ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదు. కళాశాలలో సీటు పొందిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి. ప్రధానం పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో పేద విద్యార్థినుల పరిస్థితి దారుణంగా ఉంది. – శివశంకర్ నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తిరుపతి

బ్యాంక్‌లో చోరీకి యత్నం



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రవికుమార్

నాగలాపురం: నాగలాపురంలోని యూనియన్ బ్యాంకులో మంగళవారం రాత్రి ఇద్దరు దుండగులు చోరీకి యత్నించారు. బుధవారం ఉదయం బ్యాంకు అధికారులు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. పుత్తూరు రోడ్డులోని బ్యాంకు పక్కనే సిమెంట్ గోడౌన్ షట్టర్‌ను పగులగొట్టి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. తర్వాత గోడౌన్ నుంచి బ్యాంకు గోడకు కన్నం వేసి చొరబడ్డారు. ముందుగా అలారం, సీసీ కెమెరాలను పనిచేయకుండా చేశారు. అనంతరం లాకర్ గదిలోకి వెళ్లేందుకు విఫలయత్నం చేశారు. అది తెరుచుకోకపోవడంతో వెనుదిరిగారు. ఈ క్రమంలో బ్యాంకులోని సీసీటీవీ డీవీఆర్ బాక్సులు, హార్డ్ డిస్క్‌లను తీసుకెళ్లారు. డీఎస్పీ రవికుమార్, ఎస్ఐ రామస్వామి, ట్రైనింగ్ ఎస్ఐ ప్రసాద్ ఘటనా స్థలం పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. సీసీ ఫుటేజీ ద్వారా ఇద్దరు వ్యక్తులు చోరీకి యత్నించినట్లు పోలీసులు గుర్తించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,473 మంది స్వామివారిని దర్శించుకోగా 23,900 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఫీజు చెల్లింపులు.. తప్పని పడిగాపులు

- ఎస్వీయూలో విద్యార్థుల అవస్థలు
- డిజిటల్ పేమెంట్ లేక ఇక్కట్లు



ఎస్వీయూలోని యూనియన్ బ్యాంకులో ఫీజు కట్టేందుకు నిరీక్షిస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : ఆధునిక టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రధానంగా డిజిటల్ పేమెంట్ సిస్టమ్ రాజ్యమేలుతోంది. చివరకు తోపుడు బండ్ల వ్యాపారులు సైతం ఆన్‌లైన్ చెల్లింపులను అందిపుచ్చుకున్నారు. అయితే డిజిటల్ టెక్నాలజీ, ఏఐ, డేటా సైన్స్, కోడింగ్, సైబర్ సెక్యూరిటీ అంటూ ఆధునిక కోర్సులను బోధించే ఎస్వీయూనివర్సిటీలో మాత్రం ఫీజుల చెల్లింపులకు డిజిటల్ పేమెంట్ సిస్టమ్ అందుబాటులో లేకపోవడంపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఫీజు కట్టాలంటే వర్సిటీలోని యూనియన్ బ్యాంకులో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని వాపోతున్నారు.

గంటల తరబడి నిరీక్షణ

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో ఏళ్ల క్రితమే డిజిటల్ పేమెంట్ సిస్టమ్ ప్రవేశపెట్టారు. ఎస్వీయూలో మాత్రం కళాశాల, హాస్టల్ ఫీజులు చెల్లించాలంటే విద్యార్థులు బ్యాంకులను ఆశ్రయించాల్సి వస్తోంది. వర్సిటీలోని యూనియన్ బ్యాంక్‌లో ఒకే క్యాషియర్ ఉండటంతో సాధారణ కస్టమర్లతో పాటు విద్యార్థులు వందల సంఖ్యలో సేవల కోసం ఎదురు చూస్తుంటారు.దీంతో ఫీజులు చెల్లించాలంటే గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సిందే. ఈ క్రమంలోనే ఫీజు చెల్లింపులకు ఒక రోజు కళాశాలకు సెలవు పెట్టాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీసీ చొరవ చూపాలి

ఎస్వీయూలో డిజిటల్ పేమెంట్ సిస్టమ్‌ను తక్షణం అమలులోకి తీసుకురావాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. బ్యాంకులో సిబ్బంది కొరతతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. వీసీ నర్సింగరావు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

నకిలీ మద్యం నిర్మూలనకు 'సురక్ష'

తిరుపతి క్రైమ్ : నకిలీ మద్యం నిర్మూలించేందుకు ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ తీసుకువచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఈ యాప్ ద్వారా మద్యం సీసాపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే బ్రాండ్ పేరు, పరిమాణం, బ్యాచ్ ఐడీ, ఎమ్మార్పీ, తయారు చేసిన సంస్థ, తయారీ తేదీ, సరఫరా చేసిన డిపో, విక్రయించిన దుకాణం వివరాలు వస్తాయని వెల్లడించారు. కోడ్ స్కాన్ చేసినప్పుడు ఎర్రర్, బార్‌కోడ్ ఇన్‌వాలిడ్ అని వస్తే అది నకిలీ మద్యమని, వెంటనే ఆ వివరాలు ఎక్సైజ్ క్లౌడ్‌లోకి వచ్చేస్తాయని వివరించారు. మద్యంపై ఎవరికైనా అనుమానం వస్తే 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం నిడిగల్లులో పదోతరగతి విద్యార్థినిని వేధించిన శివకుమార్ అనే వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసును మంగళవారం నమోదు చేశారు. బుధవారం ఈ మేరకు నిందితుడిని వెంకటగిరి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

పాఠశాలలో మందుబాబుల వికృత చేష్టలు



పాఠశాల రికార్డులను చెల్లా చెదురుగా పడేసిన దృశ్యం

కేవీబీపురం: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలంలోని కళత్తూరులోని ప్రాథమిక పాఠశాలలో మద్యం బాబులు వికృత చేష్టలకు దిగారు. రాత్రిళ్లు మద్యం సేవించి, పేకాట ఆడేందుకు, వ్యక్తిగత, అసాంఘిక కార్యకలాపాల కోసం పాఠశాలను వినియోగించుకోవడం అలవాటు చేసుకున్నారు. మంగళవారం రాత్రి బడికి వేసిన తాళాలను పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. అర్ధ రాత్రిలో బడిలోని పలు రికార్డులను చించేశారు. అక్కడే చిందరవందరగా పడేశారు. మద్యం సేవించిన వారు ఆ వ్యర్థాలను అక్కడే వదిలి వెళ్లారు. సాపా, దిండు అక్కడే పడేశారు. దీనిపై స్థానిక నేత ద్వారా పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించారు. ఎస్ఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ గతంలో కూడా ఇదే విధంగా తాళాలు పగలగొట్టి ,పాఠశాలలోకి చొరబడి నానా హంగామా చేశారని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి పోలీసులు నిఘా పెట్టాలని కోరారు. ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ పూర్తిగా నిఘా ఉంచుతామని, దొరికిన రోజు మందు బాబుల మత్తు దించడమే కాకుండా, కటకటాల్లోకి నెడతామని హెచ్చరించారు.

జమేదారు బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తురాలిపై ఆలయంలో దాడికి పాల్పడిన జమేదారు అలివేలుపై టీటీడీ విజిలెన్స్ అధికారులు చర్యలకు పూనుకున్నారు. మంగళవారం అమ్మవారి దర్శనం కోసం వచ్చిన చెన్నైకు చెందిన ఆండాళ్ అనే హిజ్రా భక్తురాలిపై కుటుంబ సభ్యుల సమక్షంలో జమేదారు అలివేలు దాడికి పాల్పడింది. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఆమెను ఆలయం నుంచి విధులను తప్పించి, అలిపిరికి బదిలీ చేశారు. గతంలోనూ ఇదే రీతిలో ఓ భక్తుడిపై దాడికి పాల్పడడంతో అప్పట్లో ఆమెను ఆలయం నుంచి బదిలీ చేశారు. కొద్ది రోజులకే కూటమి నేతల అండదండలతో ఆమె తిరిగి అమ్మవారి ఆలయానికి తిరిగి రావడం గమనార్హం. కాగా వివాదస్పద జమే దారు అలివేలును సున్నితమైన అలిపిరి సెక్టార్-5కు బదిలీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

రైలు కింద పడి వృద్ధుడి మృతి

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో సమీపంలో రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడు (సుమారు 65) మంగళవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై నీలం, ఎరుపు గీతల చొక్కా, ఎరుపు రంగు డ్రాయర్ ఉందని వెల్లడించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించామని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8688546060 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కబడ్డీ విజేత ఎస్వీయూ జట్టు



ట్రోఫీతో ఎస్వీయూ జట్టు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజీ మహిళల స్పోర్ట్ మీట్‌లో భాగంగా బుధవారం జరిగిన కబడ్డీ పోటీల్లో ఎస్వీయూ జట్టు విజేతగా నిలిచింది. వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, ఖోఖో పోటీల్లో ఎస్వీడబ్ల్యూ విద్యార్థినులు విన్నర్స్‌గా నిలిచారు. చెస్, బ్యాడ్మింటన్‌లో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విన్నర్స్‌కు ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి, పీడీ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందించారు.



ఖోఖో విజేతలకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

పేదల ఆస్పత్రిపై పచ్చ గద్దలు!



పేద రోగుల ప్రాణాలకు భరోసా కల్పించాలి.. నాణ్యమైన చికిత్సలందించాలి.. నిపుణులైన వైద్యులతో సేవలందించాలి.. ఇదే లక్ష్యంతో స్విమ్స్ ఆస్పత్రిని టీటీడీ నెలకొల్పింది. ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన వైద్యాలయంలో రాజకీయ జోక్యం పెరిగిపోయింది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ నేతల అరాచకాలకు వేదికగా మారిపోయింది. అందులో భాగంగానే నైపుణ్యంతో పనిలేకుండా తమ అనుచరులకు కొలువులు ఇప్పించే దిశగా పచ్చగద్దలు పథకం రూపొందించారు. టీటీడీపై ఒత్తిడి తీసుకువచ్చి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ సైతం విడుదల చేయించారు. ప్రజారోగ్యంతో యథేచ్ఛగా ఆడుకునేందుకు తెగబడ్డారు.

స్విమ్స్‌లో తిష్ట వేసేందుకు టీడీపీ నేతల యత్నం

- అక్రమ నియామకాలకు స్కెచ్
- నోటిఫికేషన్ విడుదలపై అనుమానాల వెల్లువ
- రాజకీయ జోక్యంపై మండిపడుతున్న బీజేపీ, జనసేన శ్రేణులు
- ఇంటర్వ్యూలను సైతం ప్రారంభించిన అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పేదల వైద్యాలయంగా ప్రసిద్ధి చెందిన స్విమ్స్ ఆస్పత్రి నేడు రాజకీయాలకు వేదికగా మారుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇద్దరు టీడీపీ నేతల కనుసన్నల్లో నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగులకు సైతం నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని కొందరు అధికార పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. స్విమ్స్‌లో ఏం జరుగుతోందో తెలియదు కానీ, తాజాగా వైద్యుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇదే అదునుగా టీడీపీ నేతలు తమ అనుచరులకు అవకాశం కల్పించే దిశగా పావులు కదుపుతున్నట్లు తెలిసింది.

చక్రం తిప్పుతున్న సీఎం సమీప బంధువు

సీఎం సమీప బంధువు స్విమ్స్ ఆస్పత్రిని శాసిస్తున్నారు. వైద్యుల నియామకాల్లో ఆయన చక్రం తిప్పుతున్నట్లు స్విమ్స్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే కొన్ని వైద్యుల పోస్టుల విక్రయాలపై హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎంపిక కోసం విభాగాలుగా వేసిన అన్ని కమిటీల్లోనూ సీఎం సమీప బంధువు ఉండడం అనుమానాలకు తావిస్తోంది. నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తమ వర్గీయులకే పెద్దపీట

స్విమ్స్ ఆస్పత్రిలో నియామకాల నుంచి బదిలీలు, ప్రమోషన్ల విషయంలో టీడీపీ నేతలు తమ వర్గీయులకే పెద్ద పీట వేస్తున్నా రు. సదరు ఇద్దరు నేతల ఆదేశాల మేరకు స్విమ్స్‌లో ప్రతి ఒక్కటీ నడుస్తోందని పలువురు కూటమి నాయకులే ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే తమ అనుచరు లను వైద్యులుగా నియమించుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేయించారని చెబుతున్నారు. చివరకు బుధవారంనుంచి ఇంటర్వ్యూలు సైతం మొదలుపెట్టించారని స్విమ్స్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల ఆస్పత్రిలో రాజకీయ జోక్యం మంచి పద్ధతి కాదని వాపోతున్నారు.

మభ్య పెట్టి మంత్రాంగం

స్విమ్స్ ఆస్పత్రిలో అక్రమాలపై కొందరు కూటమి నేతలు సైతం మండిపడుతున్నారు. పేదలకు నిస్వార్థంగా సేవలు అందించాల్సిన స్విమ్స్ అధికారులు ఇద్దరు టీడీపీ నేతలకు తలొగ్గి అర్హత లేని వైద్యులను, సిబ్బంది నియమిస్తే పేదల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అక్రమ నియామకాలకు పక్కా స్కెచ్ వేసిన సదరు టీడీపీ నేతలు మంత్రాంగం నడిపి ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని మభ్యపెట్టి తమ అనుచరులకు అవకాశం కల్పించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇందులో స్థానిక ఎమ్మెల్యేను డమ్మీని చేసి చక్రం తిప్పినట్లు సమాచారం.

నీరుగారిన వైద్య సేవలు

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్ ఆస్పత్రిలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో పేదలకు వైద్యసేవలు అందడం లేదు. ఆస్పత్రికి వచ్చే విరాళాలను సైతం కొందరు టీడీపీ నేతలు పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పచ్చమూక అక్రమాలకు మంగళం పాడి, పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు స్విమ్స్ ఆస్పత్రిపై పెత్తనం వదిలిపెట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ క్రమంలోనే అక్రమ నియామకాలకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తం పరిణామాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని సూచిస్తున్నారు.

పునః పరిశీలించాలి

స్విమ్స్‌లో వైద్యుల పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను టీటీడీ అధికారులు పున:పరిశీలించాలి. కొత్త నియామకాల విషయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. అర్హతలు, నైపుణ్యం ప్రామాణికంగా పోస్టులను భర్తీ చేయాలి. వివక్ష, రాజకీయ జోక్య లేకుండా పేద రోగుల సేవే లక్ష్యంగా భావించే వారికే అవకాశం కల్పించాలి. ప్రస్తుత నోటిఫికేషన్‌లో కొన్ని అనవసరమైన పోస్టులను చేర్చారు. వాస్తవంగా అవసరమైన వాటిని తొలగించారు. దీనిపై విమర్శలు వస్తున్నప్పటికీ ఇంటర్వ్యూలను చేపట్టడం సరికాదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నోటిఫికేషన్ రద్దు చేసి, మళ్లీ కొత్తగా విడుదల చేయాలి. – నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత, తిరుపతి